క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టాభిషేకం

పులివెందుల టౌన్ : కడప జిల్లా ప్రజలు రెండోసారి వైఎస్సార్‌సీపీకే పట్టాభిషేకం చేయనున్నారని జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లా ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి 4 లక్షల మెజార్టీతో హ్యాట్రిక్ కొట్టబోతున్నారని, 135 పై చిలుకు స్థానాల్లో పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్లే ఓటింగ్ శాతం పెరిగిందన్నారు.

ఏపీఆర్జేసీలో మెరిసిన విద్యార్థులు


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో రాజు, తదితరులు

పులివెందుల టౌన్ : స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్, ఏపీఆర్జేసీ ఉచిత కోచింగ్ నుంచి గత నెల 25వ తేదీన ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్జేసీ ప్రవేశపరీక్షకు 9 మంది హాజరు కాగా మొదటి కౌన్సిలింగ్‌కు రాజుల పల్లవి బైపీసీలో 94 మార్కులతో 400 ర్యాంకు సాధించగా, మద్దాల మేఘన ఎంపీసీలో 95 మార్కులతో 1050 ర్యాంకు సాధించి కర్నూల్ జిల్లా బనవాసి రెసిడెన్సియల్ కళాశాలకు ఎంపికయ్యారు. అలాగే బత్తల శివనిఖిల్ ఎంపీసీలో 84 మార్కులతో 2454 ర్యాంకు సాధించి అన్నమయ్య జిల్లా గ్యారంపల్లి రెసిడెన్సియల్ కళాశాలకు ఎంపికైనట్లు సేవాసమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. విద్యార్థులకు సేవా సమితి అధ్యక్షుడు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి ఉపాధ్యక్షురాలు అనూష, కార్యదర్శి సునీత, ప్రధాన కార్యదర్శి హేమలత, లింగాల మండల కోఆర్డినేటర్ మస్తాన్‌బాషా, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నేత్రసేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

తిరుమల వెంకన్న సన్నిధిలో మేయర్ కుటుంబం


స్వామి సన్నిధిలో మేయర్ సురేష్‌బాబు దంపతులు.

కడప కార్పొరేషన్ : తిరుమల, తిరుపతి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వరస్వామిని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, కడప మేయర్ కె. సురేష్ బాబు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వారితోపాటు టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య దంపతులు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు సతీమణి జయశ్రీ, కుమారుడు అమరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు మండలంలో 86.3 శాతం పోలింగ్

మైదుకూరు : మైదుకూరు మండలంలో పట్టణ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మండలంలో మొత్తం 79 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో మైదుకూరు మున్సిపాలిటీలో 42 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మైదుకూరు మండలంలో 64,323 మంది ఓటర్లు ఉండగా, ఈ ఎన్నికల్లో 54,621 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో పోలింగ్ శాతం 86.3గా నమోదైంది. మున్సిపాలిటీలో 42 పోలింగ్ కేంద్రాల్లో 37,039 మంది ఓటర్లు ఉండగా 30,294 మంది ఓటు వేశారు. రూరల్ మండలంలో 37 పోలింగ్ కేంద్రాల్లో 27,284 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో 24,323 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మహిళలే అధికం..

మైదుకూరు మున్సిపాలిటీ, రూరల్ మండలంలో ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. మైదుకూరు మున్సిపాలిటీలో 19,038 మంది మహిళా ఓటర్లు ఉండగా 15,783 మంది ఓటు వేశారు. రూరల్ మండలంలో 13,679 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,183 మంది ఓటు వేశారు. మండలం మొత్తం మీద 27,966 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, పురుషులు 26,655 మందే ఓటు వేశారు.

90 శాతానికిపైగా పోలింగ్

మైదుకూరు మున్సిపాలిటీలో 42 పోలింగ్ కేంద్రాలకు గాను 13 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికిపైగా ఓట్లు నమోదయ్యాయి. ఈ 13 పోలింగ్ కేంద్రాలు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో ఉన్నవే. మైదుకూరు పట్టణంలో ఒక్క పోలింగ్ కేంద్రంలో కూడా 90 శాతం పోలింగ్ నమోదు కాకపోవడం గమనార్హం. రూరల్ మండలంలో 19 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దెబ్బతిన్న అరటిపంట పరిశీలన


దెబ్బతిన్న అరటిపంటను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లి గ్రామాలలో రెండు రోజుల నుంచి వీచిన ఈదురుగాలులు, భారీ వర్షాలకు అరటి పంటలు నెలకొరిగాయి. దీంతో సుమారు 80 ఎకరాల్లో అరటి పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. రూ.లక్షల్లో నష్టం వచ్చినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డిలు గ్రామాలకు వెళ్లి దెబ్బతిన్న అరటిపంటలను పరిశీలించి మాట్లాడారు. అరటి పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించే విధంగా నివేదికలు తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రామ్ మల్లేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మం పై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం, నెలలో మొదటి ఆదివారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పోస్టల్ పాసు పుస్తకాలు పోయినవి

కమలాపురం : పట్టణంలోని పోస్టాఫీస్ నుంచి ఆర్టీసి బస్టాండుకు వెళ్లే దారిలో చెన్న కృష్ణారెడ్డికి సంబంధించిన పోస్టల్ పాసు పుస్తకాలు పోయినట్లు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నకృష్ణారెడ్డి తన ద్విచక్ర వాహనంలో పోస్టాఫీసు నుంచి తన ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినాయని, ఎవరికైనా దొరికితే పోస్టాఫీసులో గాని, పోలీస్ స్టేషన్‌లో గాని లేదా బాధితుడు చెన్నకృష్ణారెడ్డికి గాని అందజేయాలని ఆయన తెలిపారు. బాధితుని సెల్ నెంబర్ 9642781281 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

చలివేంద్రంతో ఊరట


మజ్జిగ పంపిణీ చేస్తున్న బండి రామకృష్ణారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణం మెయిన్ రోడ్డులోని వినాయకుడి గుడి సమీపంలో ఉన్న విజయ పాలడైరీ దుకాణం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని వీరపునాయునిపల్లె మండలం అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బండి రామకృష్ణారెడ్డి ఏర్పాటు చేశారు. ప్రతీ ఏడాది రోజుకు 800 లీటర్లు చొప్పున మజ్జిగను అందించడం జరుగుతోంది. బండి కుటుంబీకులను అభినందిస్తున్నట్లు వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు.

సాహిత్యం, చరిత్రలతో జిల్లా ప్రతిష్టను పెంచిన 'కట్టా'


విద్వాన్ కట్టా నరసింహులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : విద్వాన్ కట్టా నరసింహులు కైఫీయత్తుల పరిష్కారం ద్వారా మరుగున పడిన గొప్ప చరిత్రను వెలికితీసి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారని వైవీయూ పాలక మండలి సభ్యులు, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ తొలి బాధ్యులు, కడప కైఫీయత్తుల పరిష్కర్త విద్వాన్ కట్టా నరసింహులు 3వ వర్థంతిని పురస్కరించుకొని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించింది. తొలుత కట్టా చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా రచయితల సంఘంతో కలసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్య మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కట్టా సేవలను కొనియాడారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయ ఆవరణలో బ్రౌన్ శాస్త్రి సరసన కట్టా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జానమద్ది నాగరాజు, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వచారిలు మాట్లాడుతూ కట్టా లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు వెంకటేష్, మధు, డేవిడ్, గొబ్బూరి కోటేశ్వర రావు, జ్యోతి జార్జి తదితరులు పాల్గొన్నారు.

కడప వారసత్వం విలువ తెలిపిన 'కట్టా'

కడప కైఫీయత్తుల పరిష్కారంతో కడప వారసత్వ సంపద విలువ ఎంత గొప్పదో కట్టా తెలిపారని ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి అన్నారు. కట్టా తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన కైఫీయత్తుల ఆధారంగా రచించిన కథల పుస్తకాన్ని కడప కైఫీయత్తులను జిల్లా వారసత్వ సంపదగా భావించి ఇంటాక్ గ్రంథాలయంలో వాటిని అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

అపర భగీరథుడు కాటన్

కడప రూరల్ : గోదావరిపై ఆనకట్ట నిర్మించి సాగు, తాగునీటిని అందించిన అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ బిషప్ శ్యామూల్ బాబు అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత కలెక్టరేట్ వద్దనున్న అనాథలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లాండ్‌లో ఆర్థర్ కాటన్ జన్మించారన్నారు. ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలంలో బ్రిటీషు ఆర్మీ ఆఫీసర్‌గా, ఇరిగేషన్ ఇంజనీరుగా పనిచేశారన్నారు. ఆ సమయంలో రాజమండ్రి, ప్రకాశం బ్యారేజీలు నిర్మించి సాగు, తాగునీటిని అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రధానంగా గోదావరి నదిపై ఆనకట్టను నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందించి సస్యశ్యామలం చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో స్వజ్జన్ రత్నకుమార్, డేవిడ్ రాజ్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం వైఎస్సార్‌సీపీదే


డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, ప్రవాసాంధ్రులు

– గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బి.హెచ్.

కడప కార్పొరేషన్ : అధికారం చేపట్టేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అని ఆ పార్టీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ప్రవాసాంధ్రులు మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ కడప అసెంబ్లీ అభ్యర్థి ఎస్‌బి అంజద్‌బాషా, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పి. రవీంద్రనాథ్ రెడ్డిలను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 135 అసెంబ్లీ స్థానాలతో జగనన్న రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని తెలిపారు. పులివెందుల్లో తాను గెలుస్తానని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బీటెక్ రవి చెప్పడం అతిపెద్ద జోక్ అన్నారు. కడపలో టీడీపీ అభ్యర్థి మాధవి మతాల మధ్య చిచ్చు రేపి గెలవాలని ప్రయత్నించారని, పరమత సహనానికి మారుపేరైన కడప ప్రజలు ఆమెకు బుద్ధిచెప్పబోతున్నారన్నారు. సౌమ్యుడు, అందరివాడు అయిన అంజద్‌బాషా హ్యాట్రిక్ కొట్టబోతున్నారన్నారు.

గల్ఫ్ దేశాల నుంచి వచ్చి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం పని చేసిన ప్రవా సాంధ్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కువైట్, ఖతార్ వైఎస్ఆర్‌సీపీ కో కన్వీనర్లు షా హుస్సేన్, జాఫర్ హుస్సేన్, కువైట్ గవర్నింగ్ సభ్యులు షేక్ గఫార్, సుబ్బారెడ్డి, కువైట్ కమిటీ సలహాదారులు అబూ తురాబ్, కడప ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు షేక్ అన్సర్ బాషా, బాబు భై, షేక్ గయాజ్, సౌదీ అరేబియా ఎన్ఆర్ఐ షేక్ అబ్రారర్, కువైట్ ఎన్ఆర్ఐ లు మల్లికార్జున రెడ్డి, సాదిఖ్ లీడర్, షేక్ రాజక్, షరీఫ్, ఇనాయతుల్లా, సద్దాం, దుబాయ్ ఇమ్రాన్, బి.హెచ్. ఎజాస్, అబ్దుల్ రౌఫ్, అఫ్సర్, ఫారూఖ్ పాల్గొన్నారు.

18న వాసవీమాత జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 18న శ్రీ వాసవీ మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మహాప్రాకారోత్సవం, అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. సాయంత్రం 7 గంటలకు 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో లక్షకుంకుమార్చన జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కట్టా సేవలు మరువలేనివి

మైదుకూరు : జిల్లాకు రచయిత, చరిత్రకారుడు కట్టా నరసింహులు చేసిన చారిత్రక పరమైన సేవలను జిల్లా వాసులు మరిచిపోలేరని రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. మైదుకూరులో బుధవారం సాహితీ మిత్రులు నిర్వహించిన కట్టా నరసింహులు వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. జిల్లా చరిత్రను కట్టా నరసింహులు ప్రాచుర్యంలోకి తెచ్చారన్నారు.

50 క్వింటాళ్ల జీలుగలు మంజూరు

కమలాపురం : మండలానికి 50 క్వింటాళ్ల జీలుగలు మంజూరైనట్లు ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలానికి 50 క్వింటాళ్ల జీలగలు, 4 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు మంజూరు అయ్యాయన్నారు. కావలసిన రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేలకు వెళ్లి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి బయోమెట్రిక్ ద్వారా విత్తనాలు పొందవచ్చన్నారు. జీలుగలు క్వింటా పూర్తి ధర రూ.8800 కాగా 50 శాతం సబ్సిడీతో రూ.4400 చెల్లించి పొందవచ్చన్నారు. ఏకరాకు 10 కిలోల బ్యాగు చొప్పున గరిష్ఠంగా 5 ఏకరాలకు 50 కిలోలు పొందవచ్చన్నారు. అలాగే పిల్లి పెసర క్వింటా పూర్తి ధర రూ.13,400 కాగా 50 శాతం సబ్సిడీ రూ.6700 చెల్లించి విత్తనాలు పొందవచ్చని ఆమె తెలిపారు. ఏకరాకు 8 కిలోల బ్యాగు చొప్పున గరిష్ఠంగా 5 ఏకరాలకు 40 కిలోలు ఇవ్వడం జరుగు తుందన్నారు. జీలగలు సాగు చేసుకోవడం వలన నేల యెక్క సేంద్రీయ కార్బనము పెరుగుతుందన్నారు. అలాగే నేలకు నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలు అందజేయవచ్చన్నారు. నేల గుల్ల బారి మురుగునీరు పోవడానికి దోహద పడుతుందన్నారు. జీలగల వలన చౌడు భూముల్లో చౌడు విరిగిపోతుందన్నారు. రైతులు తప్పని సరిగా ఈ పచ్చ రొట్ట ఎరువులను వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.

పెద్దమ్మ తల్లికి సల్ల ముద్దల సమర్పణ


పెద్దమ్మతల్లికి సల్ల ముద్దలను ఊరేగింపుగా తీసుకుని పోతున్న మహిళలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవారి జాతర ఈనెల 18,19వ తేదీలలో వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం 1000 మంది మహిళలు సల్ల ముద్దలను అమ్మవార్లకు సమర్పించారు. సల్లముద్దలను బోనంతో ఊరేగింపుగా వచ్చి పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవార్లకు సమర్పించారు. గ్రామంలోని వీధివీధిన విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈనెల 18వ తేదీన పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవార్ల కథ, ఊరేగింపు ఉంటుంది. 19వ తేదీన పెద్దమ్మ తల్లి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న రవిశంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు

వేంపల్లె : స్థానిక గండిరోడ్డులో ఉన్న మదర్‌థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథవృద్ధులకు అన్నదానం నిర్వహించారు. బుధవారం జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్ తల్లి కంపరాజు లక్ష్మీదేవమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అనాథవృద్ధులకు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ గౌడ్ మాట్లాడుతూ అనాథల పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని, వారికి అండగా నిలవాలన్నారు. తమ తల్లి ప్రథమ వర్ధంతి వేడుకలు అనాథ వృద్ధుల మధ్య జరపడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ అనాథవృద్ధులకు చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సంజీవకుమార్ గౌడ్, విజయభాస్కర్ గౌడ్, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : లింగాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ శాంతయ్య ఒక ప్రటకనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులై 40 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు కూడా అర్హులన్నారు. అభ్యర్థులు iti.ap.gov.in ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవడానికి జూన్ 10వ తేదీన చివరి గడవు అని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు రెండు సంవత్సరాల కోర్సుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రీషిన్, ఫిట్టర్, సివిల్, మెకానికల్, డిజిల్, కంప్యూటర్ ఆపరేటింగ్, కోర్సులు ఉన్నాయన్నారు. ఐటీఐ కళాశాలలోని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పది మార్కుల జాబిత, టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఫొటో, విద్యార్థిని, విద్యార్థులు ఫోన్ నంబరు ఈమెయిల్ ఐడీలను దరఖాస్తులలో పొందపరచాలన్నారు. వివరాలకు 97041 11807, 991296371 నంబర్లకు సంప్రదించవలెనన్నారు.

బద్వేలు నియోజకవర్గంలో 78.74 శాతం పోలింగ్

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
బద్వేలు	42374	34214	80.74
పోరుమామిళ్ల	48138	36495	75.81
గోపవరం	46160	33824	73.27
కలసపాడు	25493	21092	82.74
కాశినాయన	22595	18964	83.93
బి.కోడూరు	15631	13251	84.77
అట్లూరు	18899	14820	78.41
మొత్తం	219290	172660	78.74

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలో సోమవారం ముగిసిన ఎన్నికల్లో 78.74 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని 7 మండలాల్లో 272 బూత్‌లలో 2,19,290 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,09,163 మంది పురుషులు, 1,10,122 మంది స్త్రీలు, ఇతరులు 5 మంది ఉన్నారు. మొత్తం 1,72,660 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 84,491 మంది పురుషులు, 88,167 మంది స్త్రీలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఆయా మండలాల వారీగా చూస్తే అత్యధికంగా బి.కోడూరులో 84.77 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే బద్వేలులో 80.74 శాతం, పోరుమామిళ్లలో 75.81 శాతం, గోపవరంలో 73.27 శాతం, కాశినాయనలో 83.93 శాతం, కలసపాడులో 82.74 శాతం, అట్లూరులో 78.41 శాతం ప్రకారం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో 2,04,618 మంది ఓటర్లు ఉండగా 1,58,864 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకుని 77.64 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో కంటే 14,672 మంది ఓటర్లు పెరగగా 78.74 శాతం పోలింగ్ జరిగి 1.10 శాతం ఓటింగ్ పెరిగింది.

కల్యాణ వైభోగమే..


కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి


పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన బుధవారం అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి వేకువజామున విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, శాంతిహోమాలు, జపపారాయణలు వేదపండితుల ఆధ్వర్యంలో జరిగాయి. గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా జరిపారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ శంకర్ బాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. – ప్రొద్దుటూరు కల్చరల్

వైభవంగా గ్రామోత్సవం


మైదుకూరులో బ్రహ్మంగారి గ్రామోత్సవం

మైదుకూరు పట్టణంలో కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా వీరబ్రహ్మం గోవిందమాంబల ఉత్సవ మూర్తులను అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బ్రహ్మంగారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామోత్సవంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. – మైదుకూరు